మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## జజ్జైనకరి కళాబృందం ఆధ్వర్యంలో పాటల పల్లకి 12గంటలు కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ

**నర్సాపూర్, జూలై 12, ప్రభాతవార్త:**
జజ్జైనకరి కళాబృందం ఆధ్వర్యంలో ఈ నెల 13న మెదక్‌లో నిర్వహిస్తున్న పాటలపల్లకి 12 గంటలు అనే కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా జజ్జైనక కళాబృందం టీం లీడర్ అల్లిపూర్ రమేష్ మాట్లాడుతూ నేడు మెదక్ పట్టణంలోని టిఎన్‌జివో భవన్‌లో పాటల పల్లకి 12గంటలు అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సామాజిక స్పృహను కలిగించే జానపద పాటలు, కళానృత్యాలు, నేటి సమాజంలో నడుస్తున్న వ్యవస్థపై కళాప్రదర్శనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కళాబృందం టీం లీడర్ అల్లిపురం రమేష్‌తోపాటు వరిగుంతం శేఖర్ చారి, అచ్చంపేట అంజి, పిల్లుట్ల బాబు, జాన్కంపేట సత్తయ్య, నీరుడు కృష్ణ, నాగేష్ శంకర్, నరేందర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ భూములలో బోర్డులు ఏర్పాటు చేయండి

-నర్సాపూర్ మార్కెట్‌కమిటీ మాజీ వైస్‌చైర్మన్ హబీబ్‌ఖాన్

**నర్సాపూర్, జూలై 12, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణపరిధిలోగల వక్ఫ్‌భూములలో బోర్డులను ఏర్పాటు చేయాలని మైనార్టీ నాయకులు నర్సాపూర్ మార్కెట్‌కమిటీ మాజీవైస్‌చైర్మన్ హబీబ్‌ఖాన్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ. నర్సాపూర్ పట్టణంలోని 56,57,58,60,69 సర్వేనెంబర్లలో ఈవక్ఫ్ భూములన్నాయని తెలిపారు. ఈవక్ఫ్ భూములన్నీ అన్యాక్రాంతమవుతున్నాయని ఆరోపించారు. ఈవక్ఫ్‌భూములలో బోర్డులు ఏర్పాటు చేయడంతో ఈభూములు కబ్జా కాకుండా ఉంటాయని తెలిపారు. ఈనేపథ్యంలో వక్ఫ్ భూములను కాపాడడం కోసం సంబంధిత అధికారులు బోర్డులను ఏర్పాటు చేస్తే ఆభూముల సరిహద్దులు ఏర్పడతాయన్నారు. దీంతో ఈభూముల జోలికి ఎవ్వరూ వెళ్లకుండా అన్యాక్రాంతం కాకుండా ఉంటాయన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తంచేశారు. ఈమేరకు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నర్సాపూర్ పట్టణంలో ఉన్న వక్ఫ్‌భూములకు సరిహద్దులు తెలియడం కోసం బోర్డులు ఏర్పాటు చేయాలని హబీబ్‌ఖాన్ డిమాండ్‌చేశారు.

## బిజెపిలో చేరిన బిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు



బిజెపిలో చేరినవారికి కండువాలు కప్పుతున్న ఎంపి రఘునందన్‌రావు

**గజ్వేల్ టౌన్, జూలై 12, ప్రభాతవార్త:**
బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌ల ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణానికి చెందిన పలువురు బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు సమక్షంలో బిజెపిలో చేరారు. ఈసందర్భంగా ఎంపి రఘునందన్ రావు బిజెపిలో చేరినవారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. బిజెపిలో చేరినవారిలో వాసవి క్లబ్ ప్రధాన కార్యదర్శి సిద్ధి నవీన్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు నరెడ్ల శ్రీవర్ధన్‌రెడ్డి, బిఆర్ఎస్ పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి ఎర్రవాడ యాదగిరి, 10వ వార్డు నాయకుడు తూం గోపి తదితరులు ఉన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సింగం సత్తయ్య, మాజీ జెడ్‌పిటిసి, బిజెపి సీనియర్ నాయకులు నత్తి మల్లేశం, గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, కో-కన్వీనర్ ఎల్కంటి సురేష్, గజ్వేల్ రూరల్, మండల అధ్యక్షులు పంజాల అశోక్‌గౌడ్, బిజెపి నాయకులు కుమ్మరి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కల్లులో మత్తుపదార్థాలు కలిపితే సహించం

-కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు
-నర్సాపూర్ ఎక్సైజ్ సిఐ గులాబ్ ముస్తఫా



కల్లు శాంపిల్స్‌ను సేకరించిన ఎక్సైజ్ పోలీసులు తదితరులు

**నర్సాపూర్, జూలై 12, ప్రభాతవార్త:**
కల్లులో మత్తుపదార్థాలు కలిపితే సహించేదిలేదని, ఈమేరకు ఎవ్వరైనా కల్తీ కల్లును విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని నర్సాపూర్ ఎక్సైజ్‌శాఖ గులాబ్ ముస్తఫా హెచ్చరించారు. శనివారం నర్సాపూర్‌లోని కార్యాలయంలో ఎక్సైజ్ సిఐ గులాం ముస్తఫా మాట్లాడుతూ ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు గత రెండు మూడు రోజులుగా నర్సాపూర్ సర్కిల్ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈమేరకు నర్సాపూర్ సర్కిల్ పరిధిలోని నర్సాపూర్ కౌడిపల్లి, చిలిపిచేడ్, శివ్వంపేట తదితర మండలాల్లోని గ్రామాల్లో కల్లు దుకాణలపై తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు ఇటీవల నర్సాపూర్ మున్సిఫల్ పరిధిలోని 2వ నెంబర్‌గల కల్లు దుకాణాన్ని సిబ్బందిచే తనిఖీ చేశామన్నారు. ఈమేరకు ఆదుకాణంలోని కల్లు శాంపిల్స్‌ను సేకరించామని తెలిపారు. ఈతనిఖీల్లో భాగంగా పలు కల్లు దుకాణాలలోని కల్లును సేకరించి ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ల్యాబ్ పరీక్షల్లో కల్తీ కల్లు అని నిర్ధారణ అయితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని కల్లు దుకాణం లైసెన్సును రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు. అంతేగాక ఎవ్వరైనా లైసెన్స్ లేకుండా కల్లు దుకాణాలను నడిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామన్నారు. ఈమేరకు ఎవరైనా కల్లులో మత్తు పదార్థాలు కలిపి అమ్మినా, ఎవరైనా మత్తుపదార్థాలు కలిగి ఉన్నా, అమ్మకాలు జరిపినా, కఠిన చర్యలు తీసుకుంటామని నర్సాపూర్ ఎక్సైజ్ సిఐ గులాబ్ ముస్తఫా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ అరుణ, సిబ్బంది కాజా అజీజ్ అహ్మద్‌తోపాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

-100గ్రాముల గంజాయి పట్టివేత



గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి వివరాలను తెలుపుతున్న సిఐ మహేందర్‌రెడ్డి

**వర్గల్, జూలై 12, ప్రభాతవార్త:**
గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం గౌరారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీహార్ రాష్ట్రంలోని నయటోలా అలియాస్ హమీద్‌పూర్‌కు చెందిన పవన్‌కుమార్(32) అనేవ్యక్తి వర్గల్ మండలంలోని మైలారం గ్రామంలో నివాసం ఉంటూ బీహార్‌కు చెందిన నితీన్‌కుమార్ వద్ద నుండి గంజాయిని కొనుగోలు చేసి గజ్వేల్ పరిసర ప్రాంతాలలో యువకులకు, కార్మికులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. కాగా శనివారం మండలంలోని సింగాయిపల్లి చౌరస్తా, గౌరారం గ్రామశివారులలో పవన్‌కుమార్ గంజాయి విక్రయిస్తున్నట్లు తమకు నమ్మదగిన సమాచారం రావడంతో గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్ళగా అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అదుపులోకి తీసుకొని అతన్ని తనిఖీ చేయగా 100 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. అనంతరం పవన్ కుమార్‌ను విచారించగా పూర్తి వివరాలను తెలిపినట్లు పేర్కొన్నారు. ఈమేరకు పవన్‌కుమార్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, గంజాయి ఇతర మత్తుపదార్థాలు అమ్మినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా పిల్లలు గంజాయి మత్తు పదార్థాలకు అలవాటు పడినట్లు తల్లిదండ్రులు తమకు సమాచారం ఇచ్చినట్లయితే వారి పిల్లలకు కౌన్సిలింగ్ ఇప్పించి వారు అలవాటు మానుకునేలా చేస్తామని తెలిపారు.

## కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

**గుమ్మడిదల, జూలై 12, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్‌లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీ కార్పొరేషన్ (ఎంఎస్‌డబ్ల్యు) డంపింగ్ యార్డ్ నిర్మాణం చేపట్టొద్దు అంటూ రిలే నిరాహారదీక్షలు శనివారం 158వరోజుకు చేరుకుంది. నిరాహారదీక్షలు అలుపెరగకుండా గ్రామస్థులు చేస్తున్న పోరాటానికి ప్రభుత్వంస్పందించి శాశ్వతంగా నిలిపివేస్తుందో, లేదో వేచి చూడాల్సిందే. ప్రస్తుతం హైకోర్టుఉత్తర్వులతో ఎలాంటినిర్మాణం చేపట్టకపోయినా రాబోయే రోజుల్లో కోర్టు ఏంతీర్పు ఇస్తుందో అన్న భయంతో ప్రజలు బ్రతుకుతున్నారు. అయినాసరే తమ ప్రాంతంలో డంపింగ్‌యార్డ్ ఏర్పాటుకాకుండా నిరంతరం అలుపెరగకుండా నిరాహారదీక్షలు చేస్తూ ప్రభుత్వానికి తమ గోడును వెల్లడించుకుంటున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి సస్యశ్యామలంగా ఉన్నప్రాంతాన్ని చెత్తమయంగా చేయకుండా కాపాడుకుంటామంటూ ప్రతిరోజు నిరాహారదీక్షలు చేస్తూ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈసందర్భంగా రైతులు, గ్రామస్థులు మాట్లాడుతూ రద్దుచేస్తున్నామని ఉత్తర్వులు వచ్చేంతవరకు కలిసికట్టుగా పోరాటంచేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో నల్లవల్లి గ్రామస్థులు, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు హెచ్చరించినా ఆగని అక్రమనిర్మాణాలు

-ప్రభుత్వ భూమి కబ్జా చేసి ప్రైవేటు వెంచర్
-పర్మిషన్ లేకుండానే భారీ ప్రహారీగోడ నిర్మాణం
-నాలా కబ్జా చేసి వెంచర్‌కు రోడ్డు
-సమాచారం తెలిసినా అధికారులు సైలెంట్



వెంచర్‌కు ప్రహారీగోడ నిర్మాణం చేపడుతున్న దృశ్యం

**కొండాపూర్, జూలై 12, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మునిదేవునిపల్లి గ్రామంలో అనుమతులు లేకుండానే రెండుసంస్థల ప్రైవేటు వెంచర్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సర్వే నంబర్లు 194,196,16,92లలో గేటెడ్ కమ్యూనిటీగా ప్రహరీ నిర్మాణం, రోడ్ల అభివృద్ధి చేపడుతున్నారు. ఈ భూముల్లో పలు ప్రభుత్వ నియమావళులు ఉల్లంఘిస్తూ అక్రమంగా మునిదేవునిపల్లి సర్వే నెంబర్ 92 ప్రభుత్వభూమిలో నుండి రాత్రిపూట జెసిబి, టిప్పర్ల సహాయంతో వెంచర్‌లో ఉన్న రోడ్లనిర్మాణానికి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారు. పెద్దగుట్ట కింద ఉన్న పెద్దవాగును కబ్జాచేసి అందులో ప్రహరీగోడ నిర్మాణాలు జరుగుతున్నాయి. అదేవిధంగా మన సాన్పల్లి గ్రామం నుండి పెద్దవాగులోకి నాలా సంవత్సరం క్రితం 12 ఫీట్లు ఉండగా ప్రస్తుతం దాన్ని పూడ్చి మూడుఫీట్లుగా మార్చారు. ఇరిగేషన్ అధికారులకు ఆధారాలతో సహా సమాచారం ఇచ్చినప్పటికీ ఎందుకు మౌనంగా ఉన్నారో తెలియని పరిస్థితి. ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 92లో భారీ ప్రహరీగోడ నిర్మించారు. నాలాల కబ్జా, నీటి ట్యాంకుల నిర్మాణం మొదలైన పనులు చేపడుతున్నారు. రైతుల పొలాలకు వెళ్లే మార్గాలను కూడా మూసివేయడం వల్ల స్థానికరైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెంచర్‌కు సంబంధించి ఫైనల్ లేఔట్ అనుమతిరాకముందే ఆకర్షణీయంగా రంగురంగుల బ్రోచర్లు ముద్రించి రోడ్లపై పాంప్లెట్లు పట్టుకొని ప్లాట్లు అమ్మే ప్రయత్నాలు ప్రారంభించారు. అధికార అనుమతులు లేకుండా నిర్మాణపనులు కొనసాగుతున్నాయి. జిల్లా అధికారులు హెచ్చరించినా ఆగని అక్రమాలు. గతంలో ఇలాంటి అక్రమ ప్రహరీగోడ నిర్మాణాలపై అధికారులు కూల్చివేతలుజరిపి మళ్లీ అక్రమాలకు పాల్పడితే తగుచర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి అనిత హెచ్చరించారు.

**తహసీల్దార్ వివరణ...**
ప్రభుత్వ భూమి కబ్జాచేసినా, ప్రభుత్వ భూముల్లో నుండి అక్రమంగా మట్టితరలించినా, తగిన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలకు నష్టం కలిగించే ఈవిధమైన అక్రమ ప్రాజెక్టులపై మండల అధికారులతో పాటు జిల్లా అధికారులు వెంటనే విచారణజరిపి, పనులను నిలిపివేయాలని స్థానికులు ఉన్న తాధికారులను కోరుతున్నారు.

# గర్భిణీలకు సంపూర్ణ వైద్యసేవలు

-మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**సంగారెడ్డి బ్యూరో, జూలై 12, ప్రభాతవార్త:**
మాతా శిశు సంరక్షణ ఆరోగ్యకేంద్రంలో గర్భిణీలకు సంపూర్ణ వైద్యసేవలు అందుతున్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రంలో మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆకస్మికంగా పరిశీలించారు. ఆసుపత్రిలో నవజాత శిశువుల ప్రత్యేక విభాగాన్ని కలెక్టర్ పరిశీలించారు. నవజాత శిశువులకు అందుతున్న వైద్యసేవలు గురించి సంబంధిత వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లా కేంద్రంలో మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో జూన్ మాసంలో 350 ప్రసవాలు నిర్వహించామని, అంతేకాకుండా ఫ్యామిలీ ప్లానింగ్ సంబంధించి ఇప్పటివరకు 50 మేజర్ సర్జరీలు జరిగాయని అన్నారు. గత సంవత్సర కాలంలో సుమారు 150 నుండి 200 ప్రసవాలు జరిగేవని, ఇప్పుడు ఆసంఖ్య ప్రతి నెల 300 నుండి 400కు పెరిగిందన్నారు. ప్రతి పిహెచ్‌సి పరిధిలోని గర్భిణులను ట్రాక్‌చేస్తూ వారికి ఆశా, ఎఎన్‌ఎంలను అటాచ్‌చేసి 102 వాహనాలు సన్నద్ధం చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు పెంచుతున్నామన్నారు. గర్భిణిలకు అవసరమైన టిఫా స్కానింగ్, ఇతర పరీక్షలు చేస్తున్నామన్నారు. ఓపి అధికంగా వస్తున్న నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక రిసెప్షన్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. గైనికల్ సేవలే కాకుండా మిగిలిన విభాగాలను సైతం ప్రభుత్వ ఆసుపత్రిలో బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆస్పత్రి సేవలను ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. కలెక్టర్ వెంట మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, వివిధ విధులు నిర్వహించే డాక్టర్లు పాల్గొన్నారు.

# అస్తవ్యస్తంగా గురుకుల పాఠశాల నిర్వహణ

-పాఠశాల ఆవరణలో సంచరిస్తున్న పశువులు
-విద్యార్థులతో వెట్టి చాకిరీ!
-ఓవిద్యార్థికి గాయాలు



వసతి గృహం పక్కన మొలిచిన పిచ్చి మొక్కలు

**హత్నూర, జూలై 12, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన హత్నూరలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో పాఠశాల నిర్వహణ గాడి తప్పిందని వారు విమర్శిస్తున్నారు. పాఠశాలలో చదువుకోవాల్సిన పిల్లలతో వెట్టిచాకిరి చేస్తున్నారని, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగాలేదని, బోధనా సిబ్బంది కూడా కొందరు సకాలంలో విధులకు హాజరుకావడం లేదని, అయినా ప్రిన్సిపల్ పట్టించుకోవడం లేదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. డార్మెటరీహాల్ పక్కన పిచ్చిమొక్కలు మొలిచినా, పశువులు సంచరిస్తూ తిరిగినా, ప్రిన్సిపల్ పట్టించుకోవడంలేదని వారు ఆరోపిస్తున్నారు. వెట్టిచాకిరీ చేయించడంలో విద్యార్థులకు మినహాయింపు కూడా లేకుండాపోయిందని, పాఠశాలలోని స్క్రాబ్‌ను ప్రిన్సిపల్ విద్యార్థులతో మోయించడంతో, ఫస్ట్ ఇయర్‌కు చెందిన విద్యార్థికి ఇనుప చువ్వ తగిలి గాయాలు అయ్యాయని ఐదు కుట్లు పడ్డాయని తోటి విద్యార్థులు తెలిపారు. వెంటనే చికిత్స చేయించి విద్యార్థిని వారి సొంత గ్రామానికి పంపించారని వారు తెలిపారు. బోధన సిబ్బంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పోతుండడంతో సకాలంలో విధులకు హాజరు కాలేకపోతున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఈవిషయమై పాఠశాల ప్రిన్సిపల్ శంకర్‌ను వివరణకోరగా పాఠశాలలో విద్యార్థులు పనులుచేయడం, దెబ్బలు తగలడం సహజమేనని అన్నారు. ఉదయంపూట కొంతమంది బోధనాసిబ్బంది మాత్రమే సక్రమంగా హాజరుకాలేకపోతున్నారని, మిగతా వాళ్ళంతా హాజరవుతున్నారని అన్నారు. వర్షాకాలం కావడంతో డార్మెటరీ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయని అన్నారు. పాఠశాల ఆవరణలో హత్నూర గ్రామానికి చెందిన వారి పశువులు మేపుకోవడానికి మినహాయింపులు ఇచ్చామని వ్యంగంగా అన్నారు.

# పిల్లలకు క్రీడలపై అసక్తిని పెంచాలి

-టోర్నమెంట్‌ను ప్రారంభించిన హరీష్‌రావు



క్రీడా జెండాను ఆవిష్కరిస్తున్న హరీష్‌రావు

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:**
తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా ఆడే ఆట వాలీబాల్ అని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని సిటిజన్‌క్లబ్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి మహిళావాలీబాల్ టోర్నమెంట్‌ను హరీష్‌రావు జ్యోతి ప్రజ్వలనచేసి క్రీడాజెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఊరూరా వాలీబాల్ నెట్టు ఉండేదని.. చిన్ననాటి కాలంలో కూడా ఆటపై ఆసక్తి ఎక్కువగా ఉండేదన్నారు. సిద్దిపేట వాలీబాల్ అసోసియేషన్ వారు మంచి క్రీడాకారులను రాష్ట్రానికి దేశానికి అందించారని తెలిపారు. తల్లిదండ్రులకు పిల్లల మీద నిజమైన ప్రేముంటే వారి శారీరక దృఢత్వానికి కృషి చేయాలన్నారు. పిల్లలకు క్రీడలపై అసక్తిని పెంచాలన్నారు. అనుకున్న మార్కులు రాలేదని, ర్యాంకు రాలేదని మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వస్తుందన్నారు. మానసిక సంసిద్ధతను ఆటలు నేర్పుతాయన్నారు. సిద్దిపేటలో అన్ని గ్రామాల్లో స్పోర్ట్స్ కిట్టును అందించామన్నారు. నేషనల్ ఈవెంట్స్ జరిగితే విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. అనంతరం సిద్దిపేట, సరూర్‌నగర్ మధ్య పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సిటిజన్‌క్లబ్ అధ్యక్షులు రమేష్, క్లబ్ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం

**వర్గల్, జూలై 12, ప్రభాతవార్త:**
ఇంట్లోకి నిత్యావసర సరుకులు తెస్తానని వెళ్ళిన యువతి అదృశ్యమైన సంఘటన నాచారం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వర్గల్ మండలం నాచారం గ్రామ సమీపంలోని శ్రీసాయి సీడ్స్ కంపెనీలో సిద్ధార్థనగర్, తెటూరి బజార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆసియాఖతున్(23) తల్లిదండ్రులు సలావుద్దీన్, రెహనభానులు కలిసి ఒక రూమ్‌లో ఉంటూ అదే కంపెనీలో పనిచేస్తున్నారు. ఈనెల 9వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు ఇంట్లోకి సామాను తెస్తానని ఆసియాఖతున్ తల్లిదండ్రులకు చెప్పి రూమ్‌నుండి వెళ్ళి తిరిగిరాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆసియాఖతున్ తల్లి రెహనభాను పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

## అంతర్ రాష్ట్ర ముఠాసభ్యులలో ఇద్దరు నిందితుల రిమాండ్

-పరారీలో మరో ముగ్గురు నిందితులు
-రూ.3,24,77 నగదు 272 కిలలో కాపర్‌వైర్ స్వాధీనం
-వివరాలను వెల్లడించిన సిపి డా॥అనురాధ



స్వాధీనం చేసుకున్న కాపర్‌వైర్‌ను చూపుతున్న సిపి డా॥అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి కాపర్ వైర్‌ను దొంగిలించిన 5గురు అంతర్ రాష్ట్ర మూఠాసభ్యులలో ఇద్దరు నిందితులను అరెస్టుచేశారు. 272 కిలోల కాపర్‌వైర్, రూ.3,24,700 నగదు, ఒక మోటార్‌సైకిల్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సిపి డాక్టర్ అనురాధ తెలిపారు. తన కార్యాలయంలో సిపి డాక్టర్ అనురాధ శనివారం విలేకరులకు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండపాక మండలకేంద్రంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి కాపర్‌వైర్‌ను దొంగిలించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మేనెలలో ఎఇ దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదుచేసి పరిశోధన ప్రారంభించినట్లు తెలిపారు. ఈక్రమంలో కాపర్‌వైర్ దొంగలను పట్టుకోవడానికి గజ్వేల్ ఎసిపి నరసింహులు ఆధ్వర్యంలో తొగుట సిఐ లతీఫ్, కుకునూర్‌పల్లి, బేగంపేట ఎస్ఐలు శ్రీనివాస్, మైపాల్‌రెడ్డిలతో ప్రత్యేకటీమ్స్ ఏర్పాటుచేసి సిసి కెమెరాలద్వారా నిందితులను పట్టుకున్నట్లు ఆమె తెలిపారు. రాజస్థాన్ భరత్‌పూర్ జిల్లా పీపాలఖేదాకు చెందిన మహమ్మద్ అజారుద్దీన్(27), మహమ్మద్ షాకీర్(28), తెలీమ్‌ఖాన్(19), సలీమ్ అలియాస్ సోహెల్, అక్రమ్‌లు జెసిబి డ్రైవర్లు, అపరేటర్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. ఈక్రమంలో జల్సాలకు డబ్బులు సరిపోకపోవడంతో మూఠా ఏర్పడి కాపర్‌వైర్‌ను దొంగిలించడం పనిగా పెట్టుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో రాత్రిపూట కరెంటు ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి అందులో ఉన్న కాపర్‌వైర్ దొంగిలించి అమ్ముకుంటున్నారని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో 26, మెదక్‌లో 34, కరీంనగర్‌లో 19, వరంగల్‌లో 63, రాచకొండ కమిషనరేట్‌లో 40, పెద్దపల్లిలో 1, సైబరాబాద్‌లో 2, ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి కాపర్‌వైర్ దొంగిలించారని వివరించారు. నిందితులపై 185 కేసులు ఉన్నట్లు తెలిపారు. నిందితుల్లో మహమ్మద్ అజారుద్దీన్, మహమ్మద్ షాకీర్‌లను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించగా మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని వారినిసైతం త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. కేసును చేధించి ప్రాపర్టీ రికవరీ చేసిన తొగుట సిఊ లతీఫ్, ఎస్ఐలు శ్రీనివాస్, మైపాల్‌రెడ్డి, కానిస్టేబుళ్లు, సిబ్బంది మధుసూదన్‌రెడ్డి, రమణ, రమేష్, శ్రీకాంత్, భాస్కర్‌రెడ్డి, నరేష్, తిరుపతి, సతీష్, మజీద్, రత్నాకర్, చంద్రం, స్వప్న, వనిత, శ్రీకాంత్, రమేష్‌లను అభినందించి సిపి చేతుల మీదుగా నగదురివార్డు అందించారు. సమావేశంలో గజ్వేల్ ఎసిపి నరసింహులు, తొగుట సిఐ లతీఫ్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో తండ్రీకొడుకులు మృతి

**కొండాపూర్, జూలై 12, ప్రభాతవార్త:**
విద్యుత్ షాక్ తగిలి తండ్రీకొడుకులు మృతిచెందిన ఘటన మండలలోని గొల్లపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై సోమేశ్వరి చెప్పిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చాకలి మాణయ్య(46), కుమారుడు చాకలి వెంకటేశం(20) ఇంటిపై బోరుబావి ఇనుపపైపులు పెడుతుండగా ప్రమాదవశాత్తు ఇంటిపైగల హైటెన్షన్ వైరుతగిలి తండ్రీకొడుకులు అక్కడికక్కడే మృతిచెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబాల ఫిర్యాదుతో ఎస్సై సోమేశ్వరి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు వివరించారు. ఆసుపత్రి వద్ద మృతుల కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

## ఘనంగా దుర్గమ్మ జాతర

**కొండాపూర్, జూలై 12, ప్రభాతవార్త:**
కొండపూర్ మండలంలోని అనంతసాగర్ గ్రామంలో దుర్గమ్మజాతర వైభవంగా నిర్వహించారు. శనివారం ఆషాఢమాస ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో పోచమ్మ, దుర్గమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ దేవాలయాలకు మహిళలు బోనాలతో శివసత్తుల ఊరేగింపులతో తరలివెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు పెద్దయెత్తున అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక ఆలయాల ఖిల్లా సిద్దిపేట జిల్లా

-సిద్ధిపేటలో ఏ కార్యక్రమం చేపట్టినా సిద్ధిస్తుంది

-మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు



గురుపూజోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న హరీష్‌రావు

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
ఆధ్యాత్మిక ఆలయాల ఖిల్లా సిద్దిపేట జిల్లా...సిద్దిపేటలో ఏ కార్యక్రమం చేపట్టినా సిద్ధిస్తుందని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బైరిఅంజయ్యగార్డెన్‌లో హనుమాన్ పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామివారి గురుపూజోత్సవంలో శనివారం పాల్గొని మాట్లాడారు. మనిషికి దైవస్మరణ, గురుపూజలో ఉన్న సంతృప్తి, ఆనందం ఎందులో ఉండద న్నారు. ప్రపంచంలో అత్యధిక హనుమాన్ మాలధారణ చేసే భక్తులు ఎక్కడ ఉన్నారంటే సిద్దిపేటలో ఉన్నారంటూ గురూజీ దుర్గాప్రసాద్ అన్నారు. కోటి హనుమాన్ చాలీసా సిద్దిపేట నుంచి ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. బంగారుమైసమ్మ ఆశీస్సులు అందరిపై ఉండా లని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కెసిఆర్‌నగర్ డబుల్‌బెడ్ రూంలలో శనివారం నిర్వహించిన బంగారు మైసమ్మ బోనాల ఉత్సవాల్లోపాల్గొని అమ్మవారికి పూజలుచేసి మాట్లా డారు. సిద్దిపేటలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లు దేశానికి ఆదర్శంగా నిలిచా యన్నారు. ప్రతి ఇంటిముందు చెత్తాచెదారం ఉండొద్దని, ప్లాస్టిక్ విని యోగాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. ఆయనవెంట బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## ఎస్ఐలను మర్యాదపూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ నేతలు



బదిలీపై వెళ్తున్న ఎస్ఐ మహేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ టౌన్, జూలై 12, ప్రభాతవార్త:**
హుస్నాబాద్ నూతన ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్న లక్ష్మారెడ్డిని శని వారం బిఆర్ఎస్‌పార్టీ మండల అధ్యక్షులు గంగం మదన్‌మోహన్‌రెడ్డి, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మెన్ ఎడబోయిన తిరుపతిరెడ్డిల ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇక్కడ గతం లో విధులునిర్వహించి సిద్దిపేటకు బదిలీపై వెళ్తున్న ఎస్ఐ తోట మహేష్ ను కలిసి శాలువాతో సత్కరించి వీడుకోలు పలికారు. ఎస్ఐలను కలిసిన వారిలో సీనియర్ నాయకులు బొల్లి శ్రీనివాస్, కూతాటి విజయ్‌భాస్కర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## అన్నిప్రాంతాలలో పోటీకి సిద్ధంగా ఉన్నాం

-సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

**హుస్నాబాద్ రూరల్, జూలై 12, ప్రభాతవార్త:**
వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ బలంగా ఉన్న అన్ని ప్రాంతాలలో సర్పంచ్, ఎంపిటిసిలు, జడ్పిటిసిలుగా పోటీచేసేందుకు సిద్ధంగా ఉన్నా మని సిపిఐ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని అణభేరి సింగిరెడ్డిల అమరుల భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చట్టసభల్లో కమ్యూనిస్టులు ఉంటేనే అర్థం ఉంటుందని, సమస్యలపరిష్కారం కమ్యూనిస్టులతోనే సాధ్య మౌతుందని పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీన సిపిఐపార్టీ జిల్లా మహా సభలు హుస్నాబాద్‌లోనే నిర్వహించబోతున్నామని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్, సీనియర్ నాయకులు కోమటి సత్యనారాయణ, ఎడల వనేష్, కొమ్ముల భాస్కర్, వేల్పుల శ్రీనివాస్, ముంజ గోపి, అందె అశోక్, యాద పద్మ, సుదర్శనచారి, జేరిపోతుల జనార్ధన్(జెజె) తోపాటు తది తరులు ఉన్నారు.

## నిరుపేదల సంక్షేమానికి సర్కారు కృషి

-కాంగ్రెస్ నాయకులు హరికృష్ణ, అత్తు



భూమిపూజ చేసి మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**సిద్దిపేట అర్బన్, జూలై 12, ప్రభాతవార్త:**
కులగణన చేసి బిసి రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం 42శాతం బిసి రిజర్వేషన్ అమలుచేసి చూపిస్తున్న ఘనత సిఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి.ఇమామ్(అత్తు)లు అన్నారు. జిల్లా కేంద్రంలోని 14వ వార్డులో శనివారం పార్టీ నాయకులు అలకుంట మహేందర్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్దిదారులతో కలిసి ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి వారు మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతిహామీని సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో దశలవారీగా అమలు చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేయడం జరుగుతుం దన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మీ, గయాజుద్దీన్, సనా రజిత, శ్రీకాంత్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## శాకాంబరిగా కన్యకాపరమేశ్వరి

**కొండపాక, జూలై 12, ప్రభాతవార్త:**
కుకునూరుపల్లి మండల కేంద్రంలో శనివారం అషాఢమాసం సందర్భంగా ఆర్యవైశ్య మహిళావిభాగం, ఉమ్మడికొండపాక మండల వాసవి క్లబ్ ఆధ్వ ర్యంలో ఉమామహేశ్వరస్వామి దేవాలయంలోని వాసవీకన్యకాపరమేశ్వరి మాతకు శాకాంబరి ఉత్సవాలు నిర్వహించారు. అదేవిధంగా సామూహిక పారాయణం, సామూహిక గోరింటాకుసంబరాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య విభాగం అధ్యక్షురాలు స్రవంతి, రమ్య అధ్వర్యంలో ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.

# బర్దీపూర్ కబ్జాభూమిని సందర్శించిన ఎమ్మెల్సీ

-బర్దీపూర్ మహారాజ్ కబ్జా చేసిన భూమిని పరిశీలించిన ఎమ్మెల్సే తీన్మార్ మల్లన్న



కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

**మునిపల్లి, జూలై 12, ప్రభాతవార్త:**
మునిపల్లి మండలం బుధేరా చౌరస్తాలోని జాతీయ రహదారి ప్రక్కన బర్దీపూర్ మహారాజ్ కబ్జాచేసిన కోలుకుండె సరస్వతి వ్యవసాయభూమి ని శనివారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సందర్శిం చారు. ఆభూమికి సంబంధించిన పత్రాలను, పట్టాపాస్ పుస్తకాలను పరిశీలించారు. తాము ఇరువై ఏళ్లుగా ఇక్కడ వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నామని, ఈభూమిని బర్దీపూర్ మహా రాజ్ కబ్జాచేసి తమను మానసిక క్షోభకు గురి చేస్తున్నాడని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన నుండి తమభూమిని ఇప్పించి న్యాయం చేయాలని వేడుకున్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లా డుతూ రెవెన్యూ అధికారుల తప్పిదాల వల్ల భూ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రభుత్వ భూ ముల్లో పట్టాలిచ్చి హద్దులు నిర్ణయించకపోవడం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. సర్వే నెంబరు 30లో హద్దులు నిర్ణయించకుండా రెండెకరాలచొప్పున భూమినిపంపిణీచేశారని గ్రామ స్థులు పేర్కొన్నారు. కోలుకుండె సరస్వతి గత 20 ఏళ్లుగా కబ్జాలో వుండి వ్యవసాయం చేసుకుంటు న్నారని ఆయనదృష్టికి తెచ్చారు. రెవెన్యూ అధికా రులు బాబాకు కొమ్ముకాస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈభూమిలో కొంతభాగం జాతీయ రహ దారివిస్తరణలో పోవడంతో సరస్వతి కుటుంబీకు లకు రూ.2లక్షల80వేలు నష్టపరిహారం కూడా చెల్లించారని ఈసందర్భంగా వారు గుర్తుచేశారు. ఇక్కడ ఇతరవ్యక్తులు నిర్మించిన గుడికి తన దత్తగిరి ఆశ్రమం బోర్డు తగిలించుకుని గుడి ప్రక్కన గల కోలుకుండె సరస్వతి స్థలం ఆక్రమణకు పాల్పడు తున్నాడని వివరించారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి సరస్వతి కుటుంబీకులకు న్యాయం జరిగేలా కృషిచేస్తానని ఎమ్మెల్సీ వారికి భరోసాని చ్చారు. అనంతరం మండలంలోని కంకోల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి గ్రామా నికి చెందిన నాయకులతో మాట్లాడారు.

## మంత్రిని కలిసిన మున్సిపాలిటీ నాయకులు



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, జూలై 12, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండలం నాయకులు శుక్రవారం తెలంగాణ సచివాలయం డాక్టర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సెక్రెటేరియట్ కార్యాలయంలో మెదక్ ఉమ్మడిజిల్లా ఇన్చార్జి మంత్రి కార్మిక, ఉపాధి శిక్షణ కర్మాగారములు, గనుల, భూగర్భశాఖ మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామిసీ అంబేద్కర్‌సంఘం జిల్లా నాయకులు తుడుం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని తెలిపారు. ఈసందర్భంగా తుడుం శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడిమెదక్ అత్యధిక రైతులు సాగుచేసే ప్రాంతమని, వ్యవసాయ ఆధారిత జిల్లాగా మెతుకుసీమ మెదక్ జిల్లాగా ఉందని గుర్తుచేశారు. రైతులకు కార్మికులకు మంచి పథకాలతో లబ్ది చేకూర్చే విధంగా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని మెదక్ ఉమ్మడిజిల్లాను మరింత అభివృద్ధిపథంలోకి తీసుకె ళ్లాలని కోరినట్టు తెలిపారు. కార్యక్రమంలో మల్లేపల్లి ప్రకాష్, మహమ్మద్ ఖాజా, మురళీకృష్ణ, దేవేంద్రయాదవ్ తదితరులు ఉన్నట్టు తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**చిన్నశంకరంపేట, జూలై 12, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేట మండలం రుద్రారం గ్రామానికి చెందిన నర్సింలు అనారోగ్య కారణాలతో ఇటీవల మరణించగా ఈవిషయం తెలుసుకున్న లీలా గ్రూప్‌చైర్మన్ మోహన్‌నాయక్ శనివారం బాధితకుటుంబాన్ని పరామర్శిం చారు. నిత్యావసర సరుకులు, 25కేజీల బియ్యంతో పాటు 5వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మంచాల లక్ష్మణ్, ప్రసాద్, రాజు, నరేష్, లాలు, యాదగిరి, జైపాల్, రమేష్, రాజు, హుస్సెన్, రమేష్,శ్రీకాంత్, సంజీవులు, దుర్గయ్య, మదులు ఉన్నారు.

**గవ్వలపల్లి తండాలో...**
మండలపరిధిలోని గవ్వలపల్లి తండాకు చెందిన రవీందర్‌నాయక్ ఇటీవల మరణించగా ఈవిషయం తెలుసుకున్న లీలా గ్రూప్ చైర్మన్ మోహన్‌నాయక్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, 25 కేజీల బియ్యంతోపాటు, 5వేల రుపాయల ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట రమేష్, దీప్ సింగ్, మోహన్, చందర్, సుధాకర్,సురేష్ నాయక్, బాలక్రిష్ణ, తారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం



డ్రగ్స్‌పై అవగహన కల్పిస్తున్న సిఐ విద్యాసాగర్

**కొండపాక, జూలై 12, ప్రభాతవార్త:**
డ్రగ్స్ బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని త్రీటౌన్ సిఐ విద్యా సాగర్ సూచించారు. శనివారం బందారంలో డ్రగ్స్‌పై గ్రామప్రజలకు అవగా హన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌కుదూరంగా ఉండాలని సూచించారు. చెడుఅలవాట్లకు ఎంతదూరంగా ఉంటే జీవితం అంతప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ బట్ట పర్శరాములు, మాజీ అర్‌బిఎస్ మండల కన్వీనర్ ర్యాగల దుర్గయ్య, భగవాన్‌రెడ్డి, గ్రామ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు, సిద్దిపేట, దుద్దుడ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, గ్రామస్థులు గంగాధర్, గంగుల వెంకటేశం, నీల సత్యం, బడెకోల్ నర్సింలు, బట్ట నరేష్, రాగల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధికి కృషిచేస్తున్నా

-కార్పొరేటర్ పుష్పనగేష్



కాలనీలో సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జూలై 12, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ కాలనీ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తున్నట్లు కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ అన్నారు. శనివారం కాకతీయనగర్ కాలనీలో పర్యటించి కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీ అధ్యక్షులు అమృతసాగర్, కాలనీ కార్యవర్గ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ సొసైటీ కార్యాలయ ఆవరణలోని పార్క్‌పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయన్నారు. కాలనీ లోని టీచర్స్ అపార్ట్మెంట్, వెంకట్‌రావు గల్లీలో త్వరలోనే అండర్‌గ్రౌండ్ డ్రైనేజిపనుల నిర్మాణం మరో వారంరోజులలో ప్రారంభం కానున్నాయన్నారు. కార్యక్రమంలో నరేంద్రబాబు, ప్రభాకర్‌రెడ్డి, జిలానీ, రాములు, ఉమాశంకర్, రమేష్‌బాబు, వెంకట్‌రావు, శేషాద్రి, సత్యనారాయణ, గొల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్‌బెడ్ రూంలను వెంటనే అందచేయాలి

-ఆర్‌డిఓ కార్యాలయాన్ని ముట్టడించిన లబ్దిదారులు



ఆర్‌డిఓ కార్యాలయం ముట్టడించిన డబుల్‌బెడ్ రూం లబ్దిదారులు

**జహీరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:**
పట్టణ సమీపంలోని హోతి(కె) గ్రామంలో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇండ్లను లబ్దిదారులకు వెంటనే కేటాయించాలని సిపిఎం నాయకులు మహి పాల్ డిమాండ్‌చేశారు. శనివారం డబుల్‌బెడ్ రూం సర్టిఫికెట్లు పొందిన లబ్ది దారులతో కలిసి హోతి(కె) గ్రామంలో ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ శనివారం లబ్దిదారులకు ఇళ్ల తాళాలు ఇస్తామని మాటిచ్చిన అధికారులు రాత్రికిరాత్రి తాళాలు ఇవ్వడాన్ని వాయిదా వేయడం శోచనీయంగా ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి సర్టిఫికెట్టుపొందిన లబ్దిదారులకు వెంటనే డబుల్‌బెడ్ రూం తాళాలు కేటాయించాలని మహిపాల్ డిమాండ్‌చేశారు. అధికారులు స్పందించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో లబ్దిదారులు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు అతిఫ్ కృతజ్ఞతలు

**జహీరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:**
ఆనారోగ్యానికి గురైన పట్టణానికి చెందిన అతిఫ్ చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సిఎంఆర్ఎఫ్ పథకంలో 1లక్ష80వేల రూపాయలు మంజూరు చేయించగా నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స అందుకుని ఆరోగ్యంగా ఇంటికి చేరుకుని శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కుటుంబసభ్యులతో కలుసుకుని కృతజ్ఞతలు తెలపుకున్నాడు. కార్యక్రమంలో జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు నారాయణ, సంజీవ్‌రెడ్డి, పాక్స్ చైర్మన్ మచ్చేందర్, ఎస్సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, మాజీ పట్టణ అధ్యక్షులు యాకూబ్, మోహిద్దీన్, మాజీ సర్పంచ్ ఫోరం అధ్యక్షులు రవి కిరణ్, మాజీ సర్పంచ్ జగదీశ్వర్,దీపక్ అప్పి, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

# ఈ-పంచాయతీలో ఉద్యోగ భద్రత కల్పించాలి

-ఈ-పంచాయతీ సంఘం జిల్లా అధ్యక్షులు పి.నవీన్‌గౌడ్



ఆత్మీయసమ్మేళనంలో పాల్గొన్న ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు

**జగదేవ్‌పూర్, జూలై 12, ప్రభాతవార్త:**
ఈ-పంచాయతీ వ్యవస్థలో కంప్యూటర్ ఆపరే టర్లుగా 11సంవత్సరాలుగా పనిచేస్తున్నా శ్రమకు తగిన గుర్తింపు లేదని, ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిద్దిపేటజిల్లా ఈ-పంచాయతీ సంఘం అధ్యక్షుడు పి.నవీన్‌గౌడ్ అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కోటిలింగాల దేవాలయం ఆవరణలో ఈ-పంచాయతీ కంప్యూ టర్ ఆపరేటర్స్ అసోసియేషన్ 11వ వార్షికోత్సవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.
ముందుగా కంప్యూటర్ ఆపరేటర్స్ ఎదుర్కొం టున్న పలు సమస్యల గురించి చర్చించుకున్నారు. ఈ సంద ర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పంచాయతీలకు సంబం ధించిన అన్నిరకాల సేవలను, గ్రామ పంచాయతీ లకు సంబంధించిన లావాదేవీలను, జనన, మరణ ధ్రువపత్రాలను జారీచేయుట, వ్యాపార లైసెన్స్ లు, ఇంటి నిర్మాణ అనుమతులు, వివిధ రకాల వివరాలను అంతర్జాలంలో పొందుపరుస్తూ ప్రజ లకు సేవలు అందిస్తున్నామన్నారు. దీనితో పాటు ఎంపిడిఓ కార్యాలయంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలైన ప్రజాపాలన పనులు, ఎలక్షన్ పనులు తదితరవాటిని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ సంక్షేమపథకాల అమలుకుకృషిచేస్తున్నామని, ఇచ్చే వేతనాలను 3,4నెలలకు ఒకసారి అందించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మని అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క తమసమస్య లను వెంటనేపరిష్కరించి ఉద్యోగభద్రత, ఈఎస్ఐ, పిఎఫ్‌సౌకర్యం కల్పించాలన్నారు. అంతకుముందు నూతనకార్యవర్గం ఎన్నుకోగా అధ్యక్షునిగా నవీన్ గౌడ్, ప్రధానకార్యదర్శిగా స్వామి, ఉపాధ్యక్షులుగా వేణుకుమార్, నాగరాజు, బాలకృష్ణరెడ్డి, కోశాధికారి గా బరిగె నర్సింలు, సంయుక్త కార్యదర్శులుగా వెంకట్‌రాజిరెడ్డి, శివప్రసాద్, నాగరాజురెడ్డి, ప్రచార కార్యదర్శులుగా తడ్కమడ్ల సంతోష్, బట్టు ఎల్లేశ్, సహాయకార్యదర్శిగా ఫణీంద్ర, పరశురాం, సభ్యులుగా మహేష్, శ్రీనివాస్, ఉదయ్‌కుమార్, బాలరాజు, ముఖ్య సలహాదారులుగా లక్ష్మణ్, శాలికలను ఎన్నుకున్నారు.

## ఆపన్న హస్తం సేవలు అభినందనీయం

-బండారు రాంమోహన్‌రావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న బండారు రాంమోహన్‌రావు

**గజ్వేల్ టౌన్, జూలై 12, ప్రభాతవార్త:**
ఆకలికి అన్నము, వేదనకు ఔషధం లాగా ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తున్న గజ్వేల్ ఆపన్నహస్తం సేవాబృందానికి అభినందన లని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రాంమోహన్‌రావు అన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని కోల అభిరాం గార్డెన్‌లో నిర్వహించిన ఆపన్నహస్తం సభ్యుల కుటుంబ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాంమోహన్‌రావు హాజర య్యారు. కార్యక్రమంలో ఆపన్నహస్తం సహాయ కార్యదర్శి కొలిచెలిమె స్వామి, ఉపాధ్యక్షుడు మంగళ సాయి, కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్, హనుమాన్‌దాస్, హనుమంతరావు, రాంబాబు, విజయ్, రాజు, వెంకటేష్, ధన్‌రాజ్‌తో పాటు సభ్యులు తమ తమ కుటుంబసభ్యులతో కలిసి సుమారు 300మంది వరకు పాల్గొన్నారు.

## ఫంక్షన్‌హాల్‌ను వినియోగంలోకి తీసుకురావాలి

-సిపిఎం నాయకుల డిమాండ్



వెలికట్ట ఫంక్షన్ హాల్‌ను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

**కొండపాక, జూలై 12, ప్రభాతవార్త:**
ప్రభుత్వ ఫంక్షన్‌హాల్‌ను వెంటనే ప్రారంభించి వినియోగంలోకి తీసుకు రావాలని సిపిఎం మండలనాయకులు అమ్ముల బాల్‌నర్సయ్య డిమాండ్ చేశారు. మండలపరిధిలోని వెలికట్టగ్రామ ఫంక్షన్‌హాల్‌ను మండల సిఐటియు బృందం శనివారం ఫంక్షన్‌హాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాల కోసం గత ప్రభుత్వం నిర్మిచిన ఫంక్షన్‌హాల్ నిర్మాణం పూర్తి ఐనప్పటికీ దానిని ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా ఉండి మందుబాబులకు, పేకాటరాయుళ్లకు నిలయంగా మారిందన్నారు. రూ॥50లక్షలు వెచ్చించి నిర్మించిన ఫంక్షన్‌హాల్ నిరుపయోగంగా ఉండడం సరికాదన్నారు. వెంటనే అధికారులు చర్యలుతీసుకొని ఫంక్షన్‌హాల్‌ప్రారంభిస్తే వెలికట్ట, అరెపల్లి, విశ్వానాథ్‌పల్లితోపాటు మర్రిముస్యాల గ్రామా ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. పంక్షన్ హాల్ వంటగది నిర్మాణానికి రూ॥ 70 లక్షలు మంజూరైన పనులు పూర్తి చేయకుండా తాత్సారం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొమురయ్య, కొమురవెల్లి కనకయ్య, రోడ్డ బెల్లమయ్య, అమ్ముల పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

## సభ్యత్వాల నమోదు



సభ్యత్వాలను నమోదు చేస్తున్న టిఎస్ యుటిఎఫ్ జిల్లా నాయకులు

**కంది, జూలై 12, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ చేసిన హామీలను అమలు చేయాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు అన్నారు. శనివారం టిఎస్ యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా కాశీపూర్, సదాశివపేట కెజిబివి పాఠశాలలను, కందిలోని మైనార్టీ రెసిడెన్సియల్ సందర్శించి సభ్యత్వాలను నమోదుచేశారు. ఈసందర్భంగా బి.సాయిలు మాట్లాడు తూ కెజిబివి, యుఆర్ఎస్ పాఠశాలల్లో విధులునిర్వహిస్తున్న ఉపాధ్యా యుల, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటి కన్వీనర్ చందర్ రాథోడ్, నాయకులు కె.శంకర్, జయబున్నిసా, ప్రవీణ్, ఊర్మిల తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే బిసిలకు న్యాయం

**కొండపాక, జూలై 12, ప్రభాతవార్త**
కాంగ్రెస్ పార్టీతోనే బిసిలకు న్యాయం జరుగుతుందని పిఎసిఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్ అన్నారు. శనివారం అయన వెలికట్ట క్రాస్‌డ్డులో విలేకరులతో మాట్లాడారు. బిసిలకు రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ల కేటాయింపుతో బిసిలు రాజకీయరంగంలో అభి వృద్ధి చెందుతారన్నారు. ఇప్పటి సిఎం రేవంత్‌రెడ్డి వరకు కాంగ్రెస్ పార్టీ బిసిలకు అండగా ఉంటుందన్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించినందుకు సిఎం రేవంత్‌రెడ్డికి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు, బిసి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బూర్గుల సురేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

## ముగ్గురు దొంగల అరెస్టు

-13 బైకులు స్వాధీనం

-వివరాలు వెల్లడించిన డిఎస్‌పి సైదానాయక్



దోపిడికి గురైన బైక్‌లతో ముగ్గురు దొంగల దృశ్యం

**జహీరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:**
ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని 13 వాహనాలను స్వాధీనం చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసు కుంది. శనివారం పట్టణంలోని పోలీసు ఠాణా ఆవరణలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సిఐ శివలింగంతో కలసి డిఎస్‌పి సైదానాయక్ మాట్లాడుతూ జహీరాబాద్ సమీపంలోని బీదర్‌కు వెళ్లే బైపాస్ రోడ్డు బ్రిడ్జి వద్ద సిఐ శివలింగం, ఎస్ఐ వినయ్‌కుమార్, పోలీసు సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా జహీరాబాద్ నుంచి బీదర్ వైపు ముగ్గురు వ్యక్తులు పల్సర్ బైక్‌పై అనుమానాస్పదంగా వెళుతుండగా వారిని ఆపి పోలీసు ఠాణాకు తరలించి తమ దైన శైలిలో విచారించగా కర్ణాటక రాష్ట్ర బీదర్ పట్టణ సమీపంలోని గున్నెల్లి గ్రామానికి చెందిన ఎండి ఫారుక్ (19), అంజాద్‌పాషా(26), లయక్(22)లు గత నాలుగు సంవత్సరాలుగా జహీరాబాద్, సదాశివపేట, సంగారెడ్డి, హైద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో మోటారు బైక్‌లను దొంగలిస్తున్నట్లు తేలిందని, ముగ్గురి వద్ద 13 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు, పలుబైక్‌ల స్పేర్‌పార్ట్స్ స్క్రాప్‌లో అమ్మినట్లు ఒప్పుకున్నారన్నారు. స్వాధీనం చేసుకున్న బైకుల విలువ 10లక్షల వరకు ఉంటుందన్నారు. బైక్ దొంగలను పట్టుకోవడంతో చొరవ చూపిన ఐడి పార్టీ సిబ్బందిని, ఎస్ఐ వినయ్‌కుమార్, జహీరాబాద్ టౌన్ హెడ్‌కానిస్టేబుల్ నర్సింలు, కానిస్టేబుల్ సంజీవరావుఉ, ఓం దేవ్, అస్లాం, ఆనంద్, హరినేత్రలను డిఎస్‌పి, సిఐలు ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.